సాక్షి
ఒడిశా

సోమవారం । 11 । నవంబర్ । 2024



బడిలో బ్యాంక్
జవాన్ పల్లి పాఠశాలలో విద్యార్థులు కృత్రిమ బడి. బ్యాంకు ఏర్పాటు చేశారు. సేవలపై అవగాహన కల్పించారు. - 8లో



ముగిసిన పర్వ్ పోటీలు
కొరాపుట్ పర్వ్-2024 పోటీలు ముగిశాయి. ఆద్యంతం ఆసక్తిగా సాగాయి. - 8లో



లబ్ధిదారుల రాస్తారోకో
కత్తలకవిటిలో రేషన్ లబ్ధిదారులు రాస్తారోకో చేశారు. రేషన్ పంపిణీలో అవినీతి జరిగిందని ఆరోపించారు. - 8లో

న్యూస్‌రీల్

భక్తిశ్రద్ధలతో ఆమ్లా నవమి పూజలు



రాధా గోవిందునికి ఉసిరి కాయలతో పూజించిన దృశ్యం

రాయగడ: కార్తీక మాసం పర్వదినాల్లో భాగంగా ఆదివారం ఆమ్లా నవమి పూజలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. రాయగడ పట్టణంలోని బ్రాహ్మణవీధి, అవోకా టాకీస్ తదితర ప్రాంతాల్లోని రాధా కాంత్ మందిరాల్లో పూజలను ఘనంగా నిర్వహించారు. ఉసిరిక కాయలతో రాధా గోవిందుడిని పూజించారు. ఈ ప్రత్యేకమైన రోజు సందర్భంగా రాధమ్మతల్లి పాదదర్శనం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యల్లో తరలివచ్చి అమ్మవారి ఆశీర్వాదాలను తీసుకున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



పోలీసులు స్వాధీనం చేసుకున్న మృతదేహం

రాయగడ: జిల్లాలోని అంబొదల మామిడితోట సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. అటువైపుగా వెళుతున్నవారికి మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అయితే మృతదేహంపై గాయాలు ఉండడంతో పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాముకాటుతో మహిళ మృతి



సచి కారం మృతదేహం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా పోడియ సమితి పరిధిలో సచి కారం(46) అనే మహిళ పొలంలో వరి కోత కోస్తుండగా పాముకాటుకు గురై ఆదివారం మృతి చెందారు. దోర్నపాల్ గ్రామం వద్ద కౌలుకు తీసుకున్న భూమిలో ఆమె కోత కోస్తుండగా విష సర్పం కాటు వేసింది. వెంటనే ఆమెను పొడియా ఆరోగ్య కేంద్రానికి తరలించినా ఫలితం లేకపోయింది. ఆమె భర్త సర్పంచ్‌గా పనిచేస్తున్నారు. విషయం తెలిసిన వెంటనే మల్కన్‌గిరి బీజేడీ జిల్లా అధ్యక్షుడు మనాస్‌మడ్కమి, తోటి సర్పంచ్‌లు వెళ్లి పరామర్శించారు.

మహిళ ఆత్మహత్య



ఆరోగ్య కేంద్రం వద్ద బిలాసి మృతదేహం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి బేజాంగివాఢ పంచాయతీ ఎంపీవీ 20 గ్రామంలో బిలాసి హల్దా (26) అనే మహిళ మానసిక స్థితి బాగోలేక ఆత్మహత్య చేసుకున్నారు. బిలాసికి మూడేళ్ల కిందట తపన్ అనే వ్యక్తితో వివాహమైంది. ఏడాది పాటు ఈ జంట బాగానే ఉంది. అనంతరం ఓ బాబు పుట్టాడు. అయితే కొద్ది నెలలుగా ఆమె మానసిక ఆరోగ్యం దెబ్బతింది. దీంతో ఆమెను భర్త పుట్టింటికి పంపించారు. కానీ ఆమె అక్కడ ఉండకుండా మళ్లీ భర్త వద్దకే వచ్చేశారు. శనివారం సాయంత్రం బాబుకు పాలు ఇచ్చి పడుకోబెట్టి ఆమె ఆవుల పంచలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భర్త ఇంటికి వచ్చి చూసేసరికి ఆమె కనిపించలేదు. చుట్టుపక్కల వెతకగా ఆవులశాలలో ఉరికి వేలాడుతూ కనిపించింది. దీంతో వెంటనే ఆయన ఇరుగు పొరుగు వారిని పిలిచాడు. అప్పటికే ఆమె మృతి చెందింది. కలిమెల పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఐఐసీ చంద్రకాంత్ తండ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం భర్తకు మృతదేహాన్ని అప్పగించారు.



పర్లాకిమిడిలో జిల్లా స్థాయి ఆహార మేళాను ప్రారంభిస్తున్న కలెక్టర్ బిజయకుమార్ దాస్



తృణధాన్యాలు పండిస్తున్న రైతులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న డీఆర్‌డీఏ అధికారులు



రాగులు, జొన్నలతో తయారు చేసిన ఆహార స్టాల్‌ను పరిశీలిస్తున్న అధికారులు

తృణధాన్యాలతోనే ఆరోగ్యం

- కలెక్టర్ బిజయకుమార్ దాస్
- పర్లాకిమిడిలో జిల్లాస్థాయి మిల్లెట్స్ మేళా



ప్రదర్శనలో మాట్లాడుతున్న కలెక్టర్

పర్లాకిమిడి: రాగులు, జొన్నలు వంటి తృణధాన్యాలతో చేసిన ఆహార పదార్థాలు పేదింటి ఆహారం కాదని, సంపూర్ణ ఆరోగ్యాన్నిచ్చే గొప్పింటి ఆహారమని కలెక్టర్ బిజయకుమార్ దాస్ అన్నారు. రైతులంతా రాగులు, జొన్నల సాగుపై ఆసక్తి చూపాలని పిలుపునిచ్చారు. పర్లాకిమిడిలోని బిజూ కల్యాణ మండపంలో శ్రీఅన్నం, జిల్లా స్థాయి మిల్లెట్స్ మేళా(ఆహారమేళా)ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తృణధాన్యాలను మధుమేహ రోగులు నిత్య ఆహారంగా స్వీకరిస్తున్నారని చెప్పారు. జొన్నలు, రాగులు, గంటెలు తదితర పంటల సాగుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఆర్.ఉదయగిరి, నువాగడ, గుమ్మా ప్రాంతాల్లో తృణధాన్యాలు సాగు చేస్తున్న పది మంది రైతులకు సర్టిఫికెట్లు, ప్రోత్సాహకాలు కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, ముఖ్య కార్యనిర్వాహణ అధికారి గుణనిధి నాయక్, సి.డి.ఎం.ఓ. డాక్టర్ ఎం.అలీ, జిల్లా మట్టి, జలసంరక్షణ అధికారి సురేష్ పట్నాయక్, ఆర్.ఉదయగిరి కృషి విజ్ఞాన కేంద్రం అధికారి సాజిత్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాంప్రసాద్ పాత్రో, అదనపు కృషి అధికారి శుభశ్రీ ప్రియదర్శినీ, అమూల్య పాణిగ్రాహి, గుమ్మా సమితి అధ్యక్షురాలు సునేమీ మండళ్, కాశీనగర్ బ్లాక్ అధ్యక్షురాలు బల్ల శాయమ్మ, స్వాస్ సంస్థ డైరెక్టర్ డి.జగన్నాథరాజు, జెడ్పీటీసీ ఎస్.బాలరాజు, కె.సరోజ్ కుమార్ పాత్రో తదితరులు పాల్గొన్నారు.



గిరిజన పాటల సందడి



తృణ ధాన్యాలతో కోణార్క్ చక్రం

కొరాపుట్ కలెక్టర్‌కు ముఖ్యమంత్రి సత్కారం



కలెక్టర్ కీర్తివాసన్‌ను సత్కరిస్తున్న సీఎం మోహన్‌చరణ్, డిప్యూటీ సీఎం కేవీ సింగ్‌దేవ్

కొరాపుట్: కొరాపుట్ జిల్లా కలెక్టర్ వి.కీర్తివాసన్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మఝి సత్కరించారు. రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో కీర్తివాసన్‌ను దుశ్శాలువతో సత్కరించి మెమెంటో అందజేసి అభినందించారు. కొరాపుట్ జిల్లాలో త్రుణ ధాన్యల ఉత్పత్తిలో గణనీయమైన అభివృద్ధి సాధించేందుకు కలెక్టర్ ఎంతో కృషి చేశారని ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్ దేవ్ కొనియాడారు. శ్రీఅన్న అభియాన్ పథకం కింద రాగుల సేకరణలో కలెక్టర్ కీర్తివాసన్ కృషి చేశారని ముఖ్యమంత్రి కొనియాడారు.

గంజాయి పంట ధ్వంసం



గంజాయి మొక్కలు ధ్వంసం చేస్తున్న అధికారులు

కొరాపుట్: జిల్లాలో గంజాయిపై గ్రీన్ క్లీన్ కార్యక్రమం అమలు చేశారు. ఆదివారం కొరాపుట్ జిల్లా లమ్తాపుట్ సమితి మాచ్‌ఖండ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గొడిపుట్ ప్రాంతంలో అటవీ ప్రాంతంలో 20 ఎకరాల గంజాయి పంటని గుర్తించారు. దీంతో పోలీసులు, ఎక్సైజ్ శాఖ సిబ్బంది కలిసి 20 వేల గంజాయి మొక్కలను నాశనం చేశారు. కానీ ప్రతీసారి అటవీ ప్రాంతంలో పోలీసులు, ఎక్సైజ్ గంజాయి సిబ్బంది పనితీరు చూపిస్తున్నప్పటికీ, అటవీ శాఖ మౌనం వహించడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. గంజాయి సాగు చేస్తున్న భూ యజమానులపై కేసులు నమోదు చేశారు.



ధ్వంసమైన గంజాయి మొక్కలు

నాటుసారాతో నలుగురు అరెస్టు



నాటుసారా తరలిస్తూ పట్టుబడిన నిందితులు

జయపురం: జయపురం ఎక్సైజ్ సిబ్బంది అక్రమంగా నాటుసారా తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శశికాంత దత్ తెలియజేశారు. అరెస్టైనవారిలో జయపురం సమితి బలియ గ్రామానికి చెందిన మనోజ్ పొరజ, త్రినాథ్ పొరజ, బంకబిహారి గ్రామానికి చెందిన లొబొ పొరజ, జయపురం పారాబెడ ప్రాంతానికి చెందిన ఒక మహిళ ఉన్నట్లు వెల్లడించారు. వారు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం ఉదయం ఎక్సైజ్ విభాగ సిబ్బంది, ఇన్‌స్పెక్టర్ శశికాంత దత్ నేతృత్వంలో ఐఐసీ బలరాం దాస్, సెటలైట్ ఎస్ఐ చంద్రఖర రెడ్డిలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో బలియ గ్రామ కూడలి వద్ద నాటుసారా తీసుకెళ్తున్న మనోజ్ పొరజ, త్రినాథ్ పొరజలను పట్టుకుని వారివద్ద నాటుసారా జప్తు చేసి అరెస్టు చేసినట్లు శశికాంత దత్ వెల్లడించారు. అనంతరం బంకబిజ గ్రామ ప్రాంతంలో లబొ పొరజ సారాతో పట్టుబడినట్లు తెలిపారు. అదేవిధంగా జయపురం పారాబెడ ప్రాంతంలో ఒక మహిళ సారా తీసుకెళ్తుండగా అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. నాటుసారా తయారీ, విక్రయాలు, రవాణాపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉసిరి చెట్టుకు పూజలు



పర్లాకిమిడి శ్రీజగన్నాథ మందిరంలో ఉసిరి దండలతో బలభద్ర, సుభద్ర, జగన్నాథుడు



పెద్ద రాధాకాంత మఠంలో అమలానవమి సందర్భంగా ఉసిరి చెట్టుకు పూజలు

కార్తీక మాసం అమలా నవమి సందర్భంగా మహిళలు ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. మరికొందరు ఉసిరి చెట్టు కింద వనభోజనాలు నిర్వహించారు. స్థానిక శ్రీజగన్నాథ మందిరంలో బలభద్ర, సుభద్ర, జగన్నాథ స్వాములకు ఉసిరి దండలు నైవేద్యంగా బహూకరించారు.

– పర్లాకిమిడి



అమలానవమి సందర్భంగా ఉసిరి చెట్టుకు పూజలు చేస్తున్న మహిళలు

వలస కూలీ మృతి

- ఖరిగూఢ గ్రామంలో విషాదం



భర్త మృతదేహంపై వద్ద రోదిస్తున్న భార్య, కుటుంబ సభ్యులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కోరుకొండ సమితి సోమానాథ్‌పూర్ పంచాయతీ ఖరిగూఢ గ్రామానికి చెందిన వలస కూలీ గోపినాథ్‌ఖిలో (42) చెరువులో మునిగి మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాదం అలముకుంది. గోపినాథ్ ఖిలో ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నంలో ఉన్న గోల్డెన్ కంపెనీలో మూడేళ్లుగా పని చేస్తున్నాడు. శనివారం మధ్యాహ్న సమయంలో స్నానం చేసేందుకు సమీపంలో ఉన్న చెరువులో దిగుతూ కాలు జారి పడిపోవడంతో నీట మునిగిపోయాడు. సమీపంలో ఉన్నవారు చూసి రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే మునిగిపోయాడు. తోటి కూలీలు మృతదేహాన్ని బయటకు తీసి కంపెనీ ప్రతినిధులు సమకూర్చిన అంబులెన్స్‌లో స్వగ్రామం అయిన ఖరిగూఢకు ఆదివారం తీసుకొచ్చారు. భర్త మృతదేహాన్ని చూసిన భార్య కన్నీరుమున్నీరుగా రోదించిన తీరు అక్కడివారిని కలచివేసింది. కంపెనీ యాజమాన్యం తమ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

కోర్టు బంద్‌కు పిలుపు



బార్ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతున్న న్యాయవాది ముల్లి గోపాలరావు

పర్లాకిమిడి: సీనియర్ న్యాయవాది పత్తి రామారావుపై శనివారం జరిగిన యాసిడ్ దాడిని ఖండిస్తూ జిల్లాకోర్టు ప్రాంగణంలో ఉన్న బార్ అసోసియేషన్ చాంబర్‌లో సభ్యులు ఆదివారం సమావేశం నిర్వహించారు. పర్లాకిమిడి న్యాయవాదులకు రక్షణ కల్పించాలని, యాసిడ్ పోసి పారిపోయిన నిందితులను పోలీసులు దర్యాప్తు చేసి అరెస్టు చేయాలని, అందుకు మంగళవారం జిల్లా కోర్టు బంద్‌కు పిలుపు ఇచ్చినట్టు బార్ అసోసియేషన్ కార్యదర్శి రామకృష్ణ నాయక్ (బబులా) తెలిపారు. అలాగే పర్లాకిమిడి బంద్‌కు కూడా పిలుపు ఇవ్వాలని న్యాయవాదులు బార్ కౌన్సిల్‌లో డిమాండ్ చేశారు. సమావేశంలో సీనియర్ న్యాయవాది ముల్లి గోపాలరావు, మాజీ అధ్యక్షులు సిద్దేశ్వర మిశ్రా, శైలాడ శ్రీనివాసరావు, బండి విశ్వనాథం, సాబత్, పంటల ప్రసాద్ తదితరులు ఉన్నారు.



పర్లాకిమిడి బార్ అసోసియేషన్ సభ్యుల అత్యవసర సమావేశం

క్లుప్తంగా

సందడిగా డ్రాయింగ్ పోటీలు


బాలల దినోత్సవం సందర్భంగా డ్రాయింగ్ పోటీలు

పర్లాకిమిడి: బాలల దినోత్సవం పురస్కరించుకుని జిల్లా కోర్టు ప్రాంగణంలో ఆదివారం చిత్రలేఖనం పోటీలను జిల్లా జడ్జి ప్రణబ్ కుమార్ రౌత్రాయ్ ప్రారంభించారు. ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా 55 పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. 'దివ్యాంగుల హక్కులు' పై చిత్రాలు వేశారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా ఒడిశా సాహిత్య అకాడమీ మాజీ సభ్యులు బిచిత్రానంద బెబర్తా, మురళీ పోరిచ్చాలు వ్యవహరించారు.

అంతర్జాతీయ బ్యాడ్మింటన్ టోర్నీకి సూరిబాబు


సంపతిరావు సూరిబాబు

శ్రీకాకుళం న్యూకాలనీ: అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు అంపైర్‌గా జిల్లాకు చెందిన సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ సంపతిరావు సూరిబాబు నియమితులయ్యారు. ఛత్తీస్‌గఢ్‌లోని రాయపూర్ వేదికగా ఈ నెల 12 నుంచి జరగనున్న ఇండియా ఛాలెంజింగ్ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2024 పోటీలకు సూరిబాబు న్యాయనిర్ణేతగా వ్యవహరించనున్నారు. ఈయన ఎచ్చెర్ల మండలంని చిలకపాలెం జెడ్పీహెచ్ స్కూల్ పీడీగా పనిచేస్తున్నారు.

ఆగని అధికార పార్టీ వేధింపులు


వాటర్‌ప్లాంట్ వద్ద జేసీబీతో రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది

పోలాకి: మండలంలోని చెల్లాయివలసలో అధికార పార్టీ వేధింపులపర్వానికి తెరతీసింది. గ్రామంలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడైన నేతింటి రమేష్‌కు చెందిన వాటర్‌ప్లాంట్‌కు అనుకుని ఉన్న అదనపుగదిని ఆదివారం రెవెన్యూ సిబ్బంది ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే తొలగించారు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన బాధితులు ఇదేం న్యాయం అని ప్రశ్నించగా పైనుంచి ఒత్తిడి ఉందని, అర్థం చేసుకోండంటూ రెవెన్యూ సిబ్బంది బహిరంగంగానే చెప్పడం గమనార్హం. చెల్లాయివలస రెవెన్యూ పరిధిలో మొత్తం ఆక్రమణలు తొలగించకుండా కేవలం రాజకీయ కక్షతో ఇలాంటి చర్యలు చేపట్టడం పట్ల మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో ఇలాంటి సంస్కృతికి నాంది పలకవద్దని, అధికారులు తాము ఏం చేస్తున్నామో ఒకటికి రెండుసార్లు ఆలోచన చేసుకోవాలని హితవుపలికారు.

తల్లిదండ్రుల చెంతకు బాలుడు


దీక్షిత్

కాశీబుగ్గ: కాశీబుగ్గ బస్టాండ్ ఆవరణలో ఆదివారం ఉదయం దీక్షిత్ అనే మూడేళ్ల బాలుడు ఏడుస్తూ కనిపించగా స్థానికులు కాశీబుగ్గ పోలీసులకు అప్పగించారు. అనంతరం సోషల్‌మీడియాలో ప్రచారం చేయడంతో న్యూకాలనీకి చెందిన తండ్రి రమేష్ గుర్తించారు. వెంటనే పోలీసుస్టేషన్‌కు చేరుకోవడంతో కాశీబుగ్గ పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి వివరాలు సేకరించి అప్పగించారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


కలెక్టరేట్ వద్ద మహాధర్నా చేస్తున్న 104 కార్మికులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: 104 ఉద్యోగుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం కలెక్టరేట్ వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు అందక కుటుంబ పోషణ కష్టంగా మారుతోందన్నారు. 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తే ప్రజా ధనం వృథా కాకుండా ఉంటుందన్నారు. 2020 తర్వాత విధుల్లో చేరిన డ్రైవర్లు, డీఈవోలకు జీవో-7 ప్రకారం వేతనాలు అందజేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల నుంచి యాజమాన్యాలు చేస్తున్న అక్రమ వసూళ్లను తిరిగి చెల్లించాలన్నారు. 74 మంది సీనియర్ డ్రైవర్లకు శ్లాబ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఇన్సూరెన్స్ తదితర సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరారు. నిరసన కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సురేష్‌బాబు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

బడిలో బ్యాంక్

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి జవాన్‌పల్లి గ్రామంలో గల ఉన్నత పాఠశాలలో పిల్లలు కృత్రిమ బ్యాంక్, పోలీస్‌స్టేషన్, ఆస్పత్రి ఏర్పాటు చేశారు. ప్రజలకు పౌర సేవలు ఎలా అందుతాయో వివరించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సైబర్ క్రైమ్‌లు జరిగినప్పుడు ఎలా ఫిర్యాదు చేయాలో వివరించారు. బ్యాంకులకు ఆధార్ ఎలా లింక్ చేయాలో వివరించారు. టీచర్ మల్లిక్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.


రోగికు చికిత్సను అందజేస్తున్న దృశ్యం


బ్యాంక్‌లో లైన్ కట్టిన విద్యార్థులు


పాఠశాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు


బ్యాంక్‌లో రుణాలు మంజూరు చేసే విధానం వివరిస్తున్న చిన్నారులు

న్యాయవాదుల వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న జ్ఞానరంజన్ మహంతి తదితరులు

- డిసెంబర్ 29, 30 తేదీల్లో మల్కన్‌గిరి జిల్లాలో నిర్వహణ

జయపురం: అఖిల ఒడిశా న్యాయవాదుల సంఘ 53వ వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని బార్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. వార్షికోత్సవ సన్నాహక సమావేశం జయపురం కోర్టు ఆవరణలో ఆదివారం జరిగింది. జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు త్రినాథ్ సింగ్ లాల్ అధ్యక్షతన జరిగిన కోఆర్డినేషన్ సమావేశంలో అవిభక్త కొరాపుట్ జిల్లాల నుంచి న్యాయవాదులు హాజరవ్వగా.. అఖిల ఒడిశా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జ్ఞానరంజన్ మహంతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత పర్లాకిముడి న్యాయవాది పి.రామారావుపై జరిగిన యాసిడ్ దాడిని సమావేశం తీవ్రంగా ఖండించింది. దోషులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేసింది. న్యాయవాదికి నష్ట పరిహారంగా రూ. 30 లక్షలు ప్రభుత్వం అందజేయాలని, న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర పరిషత్ సభ్యులు పి.రమేష్ పాత్రో నేతృత్వంలో 15 మంది దర్యాప్తు కమిటీని ఈ సందర్భంగా నియమించారు. మొదటిసారిగా డిసెంబర్ 29, 30 తేదీల్లో మల్కన్‌గిరి జిల్లాలో నిర్వహిస్తున్న 53వ అఖిల ఒడిశా న్యాయవాదుల సంఘ మహాసభను విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ముఖ్యమంత్రి, న్యాయవిభాగ మంత్రిని ఆహ్వానించాలని సమావేశం నిర్ణయించింది. సమావేశంలో న్యాయవాదులు విష్ణు పాత్రో, దాసరథి పట్నాయక్, సుధీర్ షొడంగి, మల్కన్‌గిరి జిల్లాకు చెందిన బును మహంతి, లంబోదర తురుకు, కొరాపుట్‌కు చెందిన అజిత్ పాత్రో, సంజయ ఝా, రాయగడకు చెందిన టుటు దాస్, కొట్‌పాడ్‌కు చెందిన ప్రదీప్త బక్షి, శంకర పండ, నవరంగపూర్ నుంచి హరి బెహర, తపన సింగ్ పాల్గొన్నారు.

• ముగిసిన పర్వ్ పోటీలు


వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

జయపురం: సమితిలోని గ్రామ పంచాయతీల్లో కొరాపుట్ పర్వ్-2024 ఉత్సవాల సందర్భంగా శుక్రవారం నుంచి నిర్వహించిన వివిధ పోటీలు ఆదివారం ముగిశాయి. గ్రామ పంచాయతీ స్థాయిలో విద్యార్థులకు వక్తృత్వ, వ్యాస రచన, క్విజ్, పాటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలు బ్లాక్ స్థాయిలో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు వెల్లడించారు. పోటీలను పంచాయతీ అధికారులు, సర్పంచ్‌లు, ఆయా గ్రామ పంచాయతీల్లో ఉపాధ్యాయులు చేపట్టారు. జయపురం సమితి బీడీవో శక్తి మహాపాత్రో పోటీలను పర్యవేక్షించారు.

చిరుధాన్యాలతో మెరుగైన ఆరోగ్యం

రాయగడ: చిరుధాన్యాలు తినడం ద్వారా మెరుగైన ఆరోగ్యం సాధ్యమని జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రైతా అన్నారు. తక్కువ పెట్టుబడి, అధిక దిగుబడితో పాటు చికాకుల్లేని పంటలు చిరుధాన్యాలు మాత్రమేనని అన్నారు. స్థానిక బిజూపట్నాయక్ ఆడిటోరియంలో జిల్లాస్థాయి సంప్రదాయ పంటలు, ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఇందులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి అధిక మోతాదులో చిరుధాన్యాల పంటలను పండించగలిగితే రైతుల ఆర్థిక, సామాజిక రంగాలు ఎంతో మెరుగుపడతాయని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. చిరుధాన్యాలతో చింతలేని వ్యవసాయం రైతుల పాలిట వర ప్రదాయనిగా మారే అవకాశం ఉందన్నారు. ప్రస్తుత రోజుల్లో ప్రజల ఆహారపు అలవాట్లు మారుతున్నాయని చెప్పారు. ఆరోగ్యభద్రతకు ఎంతగానో దోహదపడే చిరుధాన్యాలపై మక్కువ చూపిస్తున్నారని అన్నారు. దీనిని ఆసరాగా తీసుకుని రైతులు చిరుధాన్యాల పంటలపై ఆసక్తి కనబర్చాలని కోరారు. రాయగడ, బిసంకటక్ ఎమ్మెల్యేలు అప్పలస్వామి కద్రక, నీలమాధవ హికక, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, జిల్లా వ్యవసాయ, ఉద్యాన వన శాఖల అధికారులు పాల్గొన్నారు. చిరుధాన్యాల పంటలను సాగు చేసి ఉత్తమ ఫలితాలను సాధిస్తున్న కొంతమంది రైతులను ఈ సందర్భంగా సత్కరించారు. చిరుధాన్యాలతో తయారు చేసి వంటకాల స్టాళ్లను ముఖ్యఅతిథులు సందర్శించారు.


ఉత్తమ రైతులను సన్మానిస్తున్న దృశ్యం


ఫుడ్‌స్టాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు


ఏర్పాటైన ఫుడ్ స్టాల్

'పెద్దలను గౌరవించాలి'


ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

జయపురం: ప్రతి ఒక్కరూ పెద్దలను గౌరవించి, దేశ ప్రతిష్టను పెంచాలని స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులు నినదించారు. భారత్ స్కౌట్స్ గైడ్స్ 75వ వార్షికోత్సవాలు పురస్కరించుకొని స్థానిక మోడ్రన్ ఇంగ్లిష్ పాఠశాలలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. జయపురం ప్రధాన మార్గాల్లో ర్యాలీ చేపట్టారు. రోడ్డులోని ప్రతీ దుకాణం వద్దకు వెళ్లి, షాపు ముందు ఒక్కొక్క డస్ట్‌బిన్ పెట్టి వ్యర్థ పదార్థాలను అందులో వేసి పట్టణ పారిశుద్ధ్యానికి తోడ్పాడాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం విద్యార్థులు వక్తృత్వ, వ్యాస రచన పోటీలను చేపట్టారు. కార్యక్రమంలో బీడీవో శక్తి ప్రసాద్ మహాపాత్రో తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కంచిలి: మండలంలోని మకరాంపురం కూడలిలో ఆదివారం సంత వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని భీమ్ గుమన్‌సింగ్(60) అనే పాన్‌షాప్ వ్యాపారి మృతిచెందాడు. శనివారం రాత్రి 11 గంటలకు రైలులో సోంపేట స్టేషన్‌కు వచ్చి ఆదివారం వేకువజామున సంతవద్దకు వచ్చాడు. కొబ్బరికాయలు కొనుగోలు చేసి రోడ్డుకు అవతలవైపు అరటి పళ్లు కొనేందుకు రోడ్డు దాటుతుండగా.. పలాస నుంచి ఇచ్ఛాపురం వెళ్లే గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి స్వగ్రామం ఒడిశా రాష్ట్రం ఖుర్దా జిల్లా బిరిబిడి గ్రామం. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ వై.రామచంద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి సోంపేట ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం చేశారు.

ఎస్సీ, ఎస్టీ చట్టాలపై వర్క్‌షాపు నేడు

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఏపీ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్టమెంట్ ఆధ్వర్యంలో ఎస్టీ, ఎస్సీ చట్టాలపై వర్క్‌షాపు(అవగాహన సదస్సు) నిర్వహించనున్నట్లు విశాఖపట్నం ప్రాంతీయ కార్యాలయం సీఐడీ విభాగం అదనపు ఎస్పీ జి.ప్రేమ్‌కాజల్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు చట్టాలు, విద్య ప్రాధాన్యంపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఐదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

ఇచ్ఛాపురం: ఆంధ్ర, ఒడిశా ప్రాంతాల్లో చోరీకి గురైన ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఇచ్ఛాపురం సీఐ మీసాల చిన్నంనాయుడు తెలిపారు. ద్విచక్ర వాహనాల చోరీ కేసులో ప్రధాన నిందితుడైన ఒడిశా చెందిన కిరణ్‌కుమార్ జనా అలియాస్ లిట్టును ఆదివారం ఈదుపురం, బెల్లుపడ కూడలిలో జాతీయ రహదారిపై పట్టుకున్నామని చెప్పారు. అతని వద్ద నుంచి నాలుగు ద్విచక్రవాహనాలు, కంచిలికి చెందిన ఢిల్లీరావు వద్ద ఉంచిన మరో ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఇందులో ఇచ్ఛాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌లో రిజిస్టర్ అయినవి రెండు, బరంపురం పోలీస్ స్టేషన్‌లో రిజిస్టర్ అయినవి మూడు వాహనాలు ఉన్నాయని తెలిపారు. నిందితులను రిమాండ్‌కి తరలించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఐ చిన్నంనాయుడు, బషీర్, క్రైం సిబ్బంది పాల్గొన్నారు.

రూ.9000 వేలు పెన్షన్ ఇవ్వాల్సిందే


ఈపీఎఫ్ పెన్షనర్ల సమావేశంలో మాట్లాడుతున్న ప్రమోద్ మహంతి


సమావేశంలో పాల్గొన్న ఈపీఎఫ్ పెన్షన్ దారులు

జయపురం: ఈపీఎఫ్ పెన్షన్‌దారులకు నెలకు రూ.9వేలు పెన్షన్ చెల్లించాలని ప్రముఖ కార్మిక నేత, ప్రమోద్ కుమార్ మహంతి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కార్మిక భవన్‌లో ఈపీఎఫ్ పెన్షనర్ల అసోసియేషన్ కొరాపుట్ జిల్లా అధ్యక్షుడు నళినీ కాంత రథ్ అధ్యక్షతన జరిగిన ఈపీఎఫ్ పెన్షనర్ల సమావేశంలో ప్రమోద్ కుమార్ మహంతి మాట్లాడుతూ ప్రావిడెంట్ ఫండ్ డబ్బు లక్షల కోట్లలో ప్రభుత్వం వద్ద ఉందని, ఆ డబ్బు అంతా కార్మికుల కష్టార్జితమని తెలిపారు. దానికి వడ్డీ కూడా వస్తుందని అందువల్ల ఈపీఎఫ్ పెన్షనర్లకు నెలకు రూ.9వేలు ఇవ్వడం కష్టం కాదన్నారు. దీనిపై ఈ నెల 28న ఢిల్లీలో ధర్నా నిర్వహిస్తామన్నారు. జయపురం సేవా పేపరు మిల్లు కార్మికులు పీఎఫ్, పెన్షన్ సమస్య పరిష్కారం కోసం ఈ నెల 21 న బరంపురం ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ కార్యాలయం మంగిట ధర్నా, ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఈపీఎఫ్ పెన్షనర్ల అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన ప్రదీప్ మహంతిని సన్మానించారు.

రేషన్ లబ్ధిదారుల రాస్తారోకో


గుసాని సమితి కత్తలకవిటి పంచాయతీ కార్యాలయం వద్ద రాస్తారోకో ఆందోళనలో మహిళలు


కత్తలకవిటి పంచాయతీ కార్యాలయం వద్ద రాస్తారోకో ఆందోళనలో మహిళలు


326ఎ స్టేట్ హైవే రహదారిలో నిలిచిపోయిన వాహనాలు

పర్లాకిమిడి: గుసాని సమితి కత్తలకవిటి గ్రామంలో మహిళలు, రేషన్ కార్డు లబ్ధిదారులు ఆదివారం ఉదయం రాస్తారోకో నిర్వహించారు. కత్తలకవిటి పంచాయతీలో పలు గ్రామాల ప్రజలకు రేషన్ డీలర్లు కార్డుపై 25 కిలోల రాగులు అందజేయాల్సి ఉండగా 15 కిలోలుమాత్రమే అందించారు. దీంతో లబ్ధిదారులు ఆందోళనకు దిగారు. ఫలితంగా గంటల తరబడి పర్లాకిమిడి, ఆర్.ఉదయగిరి, మోహన, బరంపురం (326ఎ) రహదారిలో వాహనాలు నిలిచిపోయాయి. అనంతరం తహసీల్దార్ నారాయణ బెహరా, సివిల్ సప్లై అధికారులు, పోలీసులు వచ్చి స్టాకు వచ్చిన వెంటనే రేషన్ కార్డులపై రాగులు అందజేస్తామని చెప్పడంతో ప్రజలు ఆందోళనను విరమించారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు నలుగురు ఎంపిక


ఎంపికైన క్రీడాకారులతో చెస్ కమిటీ ప్రతినిధులు

నరసన్నపేట: మండలంలోని గుండవల్లిపేట జ్యోతీరావు పూలే రెసిడెన్షియల్ స్కూల్లో ఆదివారం రాష్ట్రస్థాయి చెస్ పోటీల ఎంపికలు నిర్వహించారు. 30 మంది క్రీడాకారులు పాల్గొనగా నాలుగు రౌండ్ల పాటు పోటీలు జరిగాయి. ప్రతిభ కనబరిచిన బగాది కార్తికేయ, వి.రాహుల్, వినమ్ర, రిత్విక్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఆలిండియా చెస్ ఇన్ స్కూల్ కమిటీ సభ్యుడు సనపల బీమారావు తెలిపారు. వీరంతా ఈ నెల 19 నుంచి 21 వరకు పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు బగాది కిషోర్, కార్యదర్శి రమేష్ కోచ్‌లు అభినవ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

వెటరన్ అథ్లెటిక్స్‌లో మెరిసిన కిశోర్



ఉత్తర్ ప్రదేశ్‌లో అమేఠీలో వెటరన్ అథ్లెటిక్స్‌లో పతకాలతో అబ్కారీ ఉద్యోగి కిశోర్ చంద్ర రథ్

పర్లాకిమిడి: ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అమేథీ జిల్లాలో డాక్టర్ భీమ్‌రావ్ అంబేడ్కర్ క్రీడా మైదానంలో ఈనెల 8 నుంచి 10 వ తేదీ వరకు జరిగిన జాతీయ వెటరన్స్ అథ్లెటిక్స్ పోటీల్లో గజపతి జిల్లా పర్లాకిమిడికి చెందిన అబ్కారీ విశ్రాంత అధికారి కిశోర్ చంద్ర రథ్ బంగారు, వెండి పతకాలు సాధించారు. ఈ పోటీల్లో త్రిపుల్ జంప్‌లో బంగారు పతకం, వంద మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్‌లో రెండు వెండి పతకాలు కైవసం చేసుకున్నట్టు సాక్షితో తెలిపారు. కిశోర్‌చంద్ర రథ్ విజయంపై పలువురు జిల్లా అధికారులు అభినందనలు తెలిపారు.


అథ్లెటిక్స్‌లో కిశోర్ చంద్ర రథ్ విజయం

క్లుప్తంగా

ఆద్యంతం..అమోఘం

● ఆలోచింపజేసిన సాంఘిక నాటిక ప్రదర్శనలు



విముక్తి నాటికలో సన్నివేశం

విజయనగరం టౌన్: నటరత్న నాటక పరిషత్ ఆధ్వర్యంలో గురజాడ కళాభారతి వేదికపై నిర్వహిస్తున్న సాంఘిక నాటిక ప్రదర్శనలు ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంటున్నాయి. రెండోరోజు ఆదివారం సాయంత్రం చెరుకూరి సాంబశివరావు రచన, దర్శకత్వంలో ప్రదర్శించిన విముక్తి నాటిక ఆలోచింపజేసింది. సమాజాన్ని ముందుండి నడిపించాల్సిన యువత నేడు గంజాయి, హెరాయిన్ వంటి మత్తుపదార్థాలకు అలవాటుపడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. దేశభవిష్యత్తు ప్రశ్నార్థకంగా మార్చారు. మత్తుపదార్థాల నుంచి యువతకు విముక్తి కల్పించి, దేశాన్ని రక్షించుకుందామనే సందేశంతో ముగిసిన నాటిక ఆద్యంతం తల్లిదండ్రులను ఆలోచింపజేసింది. అనంతరం గోవాడ క్రియేషన్స్ హైదరాబాద్ వారి మూల్యం సాంఘిక నాటిక రక్తికట్టించింది. ఆడపిల్లలపై అడుగడుగునా రకరకాల ఆంక్షలతో పాటు పైశాచికత్వానికి దిగుతున్నారు. అన్నిరంగాల్లో రాణిస్తున్న మహిళపై ఆకృత్యాలకు పాల్పడుతున్నారు. అటువంటివాటికి వ్యతిరేకంగా ఒక వివాహిత తన హక్కును నిరూపించుకుని మరీ సాధించిన అపూర్వ ఘటనను నాటికలో చక్కగా చూపించారు. అభినయ సంస్థ అధ్యక్షుడు అభినయ శ్రీనివాస్, అధిక సంఖ్యలో కళాకారులు, అభిమానులు పాల్గొన్నారు.

కీళ్ల నొప్పులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య

లక్కవరపుకోట: మండలంలోని కళ్లేపల్లి గ్రామానికి చెందిన నాగిరెడ్డి సత్యం (59) పురుగు మందుతాగి శనివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై నవీన్‌పడాల్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు సత్యం కొద్దికాలంగా కీళ్లనొప్పులతో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపం చెంది ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగి అపస్మాక స్థితికి చేరుకున్నాడు. పొలంపనులు ముగించుకుని ఇంటికి వచ్చిన కుటుంబసభ్యులు కింద పడి ఉన్న సత్యాన్ని గుర్తించి హుటాహుటిన ఎస్.కోట ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్ పడాల్ తెలిపారు. మృతుడికి భార్య రాము, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి



గుర్తు తెలియని మహిళ మృతదేహం

విజయనగరం క్రైమ్: స్థానిక రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న రిజర్వేషన్ కౌంటర్ ఫుట్‌పాత్ వద్ద సుమారు 30 నుంచి 35 ఏళ్ల వయసు కలిగిన గుర్తు తెలియని మహిళ మృతిచెందినట్లు వన్‌టౌన్ పోలీసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె గురించి విచారణ చేయగా యాచకవృత్తి చేస్తూ జీవనం సాగిస్తున్నట్లు తెలిసిందన్నారు. మృతురాలి బంధువులెవరైనా ఉంటే వన్‌టౌన్ పోలీసులను సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రి మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు.

మూడు కంటైనర్ల సీజ్



పెదమాపురం పోలీస్‌స్టేషన్ వద్ద సీజ్ చేసిన పశువులను తరలిస్తున్న వాహనాలు

దత్తిరాజేరు: అక్రమంగా పశువులు తరలిస్తున్న మూడు కంటైనర్లను సీజ్ చేసినట్లు పెదమానాపురం ఎస్సై జయంతి ఆదివారం తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం పార్వతీపురం నుంచి తూర్పుగోదావరి జిల్లా కత్తిపూడికి పశువులను కంటైనర్లలో తరలిస్తుండగా పెదమానాపురం వద్ద శనివారం రాత్రి టాస్క్‌ఫోర్స్ అధికారులు కంటైనర్లను, వాటిలో ఉన్న 96 పశువులను పట్టుకుని స్టేషన్‌కు అప్పగించడంతో పశువుల యజమానులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

వరి చేను ధ్వంసం చేసిన ఏనుగులు



వరి చేనును ధ్వంసం చేస్తున్న ఏనుగులు

భామిని: మండలంలోని తివ్వాకొండల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు ఆదివారం నల్లరాయిగూడ-తాటిమానుగూడల మధ్య పంటపొలాల్లోకి వచ్చి దిగి కొంత ధాన్యం పంటను తిని, అత్యధికంగా తొక్కిసలాటతో ధ్వంసం చేశాయి. ఖరీఫ్ వరిపంట కోత దశకు వచ్చేసరికి ఏనుగుల బెడద ఎక్కువై పంటలను నాశనం చేస్తున్నాయని ఆదివాసీ గిరిజన రైతులు వాపోతున్నారు. కోత దశలోని వరిచేనును ఏనుగుల గుంపు కాళ్లతో తొక్కి నాశనం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ఆటవీ శాఖాధికారులు ఏనుగుల గుంపు బాధలు తప్పించాలని సర్పంచ్ గొయింతి ప్రసాద్ ఒక ప్రకటనలో కోరారు.

జీడి మామిడికి బీమా ధీమా

● పీఎం ఫసల్ యోజన ద్వారా లబ్ధి
● ఏజెన్సీలో అధిక శాతం జీడిమామిడి సాగు



పొలం పిలుస్తుంది కార్యక్రమంలో జీడిమామిడి రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పాలకొండ రూరల్/సీతంపేట: తోటలు సాగుచేయడం ఒడిదొడుకులతో కూడిన విషయం. వాతావరణం అనుకూలించకున్నా, చీడపీడలు, తెగుళ్ల దాడి చేసినా, వరదలు, అనుకోని విపత్తులు తలెత్తినా నష్టపోయేది ఆరుగాలం కష్టించిన రైతు. పార్వతీపురం మన్యం జిల్లాలో అధికశాతం ఏజెన్సీ కలబోసి ఉండడంతో రైతులు జీడిమామిడి సాగుపై అసక్తి చూపుతున్నారు. ఈ సాగు పూర్తిగా వాతావరణ ఆధారం. దీంతో కేంద్రప్రభుత్వం వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాన్ని రైతుల కోసం అందుబాటులోకి తెచ్చింది. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనను ప్రారంభించిన 2016లోనే ఉద్యాన శాఖ ద్వారా జీడిమామిడి పంట రైతులకు బీమా వర్తింపజేసింది. అయితే గడిచిన ఎనిమిదేళ్లుగా ఈ పథకం ఈ పంటలకు వర్తించలేదు. తాజాగా 2024-25 సంవత్సరం నుంచి జీడిమామిడి పంటకూ ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని వర్తింపజేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రకృతి వైపరీత్యాలతో తోటలు, దిగుబడి నష్టపోయిన రైతులను ఆదుకోవాలనే ఆలోచనతో ఉద్యాన శాఖ సూచనలతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. దీని కోసం రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ జీడిమామిడి తోటలకు ఈ నెల 15లోగా బీమా చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. రబీలో జీడిమామిడి పంటకు వాతావరణ గణన ఏపీఎస్‌డీపీఎస్ ఇచ్చిన నివేదిక ఆధారంగా దీనిని బీమా అమలు చేయనున్నారు. ఇఫ్కో బీమా సంస్థకు జిల్లా బాధ్యతను అప్పగించారు.

రూ. 1,600 ప్రీమియం

ఎకరాకు రూ.1,600 ప్రీమియాన్ని రైతు చెల్లిస్తే బీమా వర్తిస్తుంది. ఒక రైతు ఎన్ని ఎకరాలకైనా బీమా చేయించుకోవచ్చు. ఈకేవైసీలో నమోదు చేసుకున్న విస్తీర్ణానికి బీమా చేయవచ్చు. ఈ నెల 15 వరకూ ప్రీమియం చెల్లించడానికి గడువు ఉంది. ఇప్పటికే బ్యాంకుల్లో రుణం పొందిన, రుణం తీసుకోని రైతులూ అర్హులే. బీమా పథకం వివరాల కోసం రైతు సేవా కేంద్రాల వద్ద ఉద్యానవన శాఖ అధికారులను లేదా గ్రామ స్థాయిలో వీఏఏ, వీహెచ్ఏలను కూడా సంప్రదించవచ్చు. బీమా చేయించుకునే రైతులు తప్పనిసరిగా ఈ-పంట నమోదుతో పాటు ఈకేవైసీ చేయించుకోవాలి. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఉద్యాన శాఖ అధికారులు జీడిమామిడికి పంట బీమా పథకం గురించి అవగాహన కల్పిస్తున్నారు. మండలం యూనిట్‌గా బీమా వర్తిస్తుందని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. రైతులు ప్రీమియం చెల్లించే సమయంలో పట్టాదారు పాస్‌పుస్తకం లేక 1బీ పత్రం, ఆధార్ నకలు, బ్యాంకు ఖాతా పుస్తకం మొదటి పేజీ నకలు, పంట ధ్రువీ కరణ పత్రం అధికారులకు అందజేయాల్సి ఉంటుంది.

ఈ సందర్భాల్లో బీమా వర్తింపు

సాగులో వర్షపాతం తక్కువ, ఎక్కువ, అనుకోని వర్షం, వాన పడిన రోజులు, కురవని రోజులను లెక్కగట్టి ప్రతికూల వాతావరణాన్ని నిర్ధారిస్తారు. అత్యధిక, అత్యల్ప ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెల్సియస్ మించి 3-10 రోజులు (నవంబర్ 1 నుంచి ఫిబ్రవరి 28 వరకూ) ఉంటే పరిగణనలోకి తీసుకుంటారు. గాలిలో తేమశాతం, వేగం తదితర పరిస్థితులను కూడా పరిగణనలోకి తీసుకుంటారు..

సద్వినియోగం చేసుకోవాలి



ఏజెన్సీ కలబోసి ఉన్న జిల్లాలో దాదాపు 61వేల ఎకరాల్లో 25,252 మంది రైతులు జీడిమామడి తోటలు సాగు చేస్తున్నారు. ముఖ్యంగా సీతంపేట, కురుపాం, గుమలక్ష్మీపురం ప్రాంతాల్లో 40వేల ఎకరాల మేర తోటలను గిరిజన, సాధారణ రైతులు సాగు చేస్తున్నారు. వారికి ఈ బీమా పథకం ఎంతో ప్రయోజకరం. ఈ నెల 15లోగా ప్రీమియం చెల్లించాల్సి ఉంది. జిల్లాకు సంబంధించి ఇఫ్కో కంపెనీ ద్వారా ప్రీమియం చెల్లించాలి. అనుకోని విపత్తు ఎదురై పంట నష్టపోతే పరిహారం నేరుగా రైతు బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది. మరింత సమాచారం కోసం ఫోన్ 9550044894, 8330928627 నంబర్లను సంప్రదించవచ్చు.

తమ్మినేని అమరేశ్వరి,
ఉద్యానవన శాఖాధికారిణి, పాలకొండ

సబ్ జూనియర్ తైక్వాండో పోటీలకు జిల్లా జట్ల ఎంపిక



సబ్‌జూనియర్స్ జిల్లా స్థాయి తైక్వాండో పోటీలను ప్రారంభిస్తున్న జిల్లాక్రీడాభివృద్ధి అధికారి వెంకటేశ్వరరావు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న సబ్ జూనియర్స్ బాల, బాలికల తైక్వాండో పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఆదివారం పూర్తయ్యాయి. విజయనగరంలోని విజ్జి స్టేడియంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో 38వ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక నిర్వహించారు. ఈ సందర్భంగా విజయనగరం జిల్లా నుంచి సుమారు 150 మంది సబ్ జూనియర్ తైక్వాండో క్రీడాకారులు పోటీల్లో పాల్గొనగా పోటీలను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వర రావు ప్రారంభించారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈనెల 15, 16, 17 తేదీలలో ఒంగోలు జిల్లాలో జరిగే 38వ రాష్ట్రస్థాయి పోటీలకు హాజరుకానున్నారు. కార్యక్రమంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి డీవీ చారిప్రసాద్, సభ్యులు వెంకటేష్, కె.శ్రీనివాస్, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

రెండవరోజు ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగిన వాలీబాల్ పోటీల్లో క్రీడాకారులు

భోగాపురం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జిల్లా విద్యా శాఖ అధ్వర్యంలో జరుగుతున్న 68వ రాష్ట్రస్థాయి బాల, బాలికల అండర్-14 వాలీబాల్ పోటీలు రెండోరోజూ ఉత్సాహంగా కొనసాగాయి. ఈ రాష్ట్ర స్థాయి పోటీలకు పదమూడు జిల్లాల నుంచి వచ్చిన బాలురు, బాలికలు మొత్తం 26 జట్లకు గాను ఇప్పటివరకు 30 లీగ్ మ్యాచ్‌లు, 16 క్వార్టర్ ఫైనల్, 4 సెమీఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించినట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు కేవీవీఎన్ రాజు(చిన్నారి), సింగిడి నాగన్న తెలిపారు. సోమవారం ఫైనల్ మ్యాచ్ ముగిసిన అనంతరం 15 మంది బాలురు, 15 మంది బాలికలను రాష్ట్రం తరఫున ఎంపిక చేసి జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు పంపించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

చైన్ స్నాచింగ్ కేసులో ఇద్దరి అరెస్ట్



మాట్లాడుతున్న విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, వారు చోరీ చేసిన బంగారు చైన్ రికవరీ చేసినట్లు విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. పాల్‌నగర్‌కు చెందిన కొవ్వూరి లక్ష్మణరెడ్డి ఈ నెల 7న విశాఖ వెళ్లి, ఆర్టీసీ బస్సులో రాత్రి 10.30 గంటల సమయంలో విజయనగరంలో దిగి, లీలామహల్ సందు నుంచి రైల్వేస్టేషన్ వద్దనున్న సైకిల్ స్టాండ్‌లో ఉన్న మోటార్‌సైకిల్ తీసుకురావడానికి నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఆ సమయంలో ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు స్కూటీమీద వెనుక నుంచి వచ్చి లక్ష్మణరెడ్డిని కింద పడేసి, మెడలోని తులం బంగారం చైన్ తీసుకుని, పారిపోయినట్లు వన్‌టౌన్ పోలీసులకు బాధితుడు ఫిర్యాదుచేశాడు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు పట్టణానికి చెందిన మహంతి వినోద్ కుమార్ అలియాస్ వినోద్, పొట్నూరు డేవిడ్ రాజు, అలియాస్ డేవిడ్‌లను కంటోన్మెంట్ రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో ఆదివారం అరెస్టు చేసి, వారినుంచి తులం బంగారు చైన్, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరో నిందితుడ్ని త్వరలో అరెస్టు చేస్తామని, గాలింపు చర్యలు చేపట్టామని డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో క్రియాశీలకంగా పనిచేసిన వన్‌టౌన్ ఇన్‌చార్జ్ సీఐ ఎల్. అప్పలనాయుడు, ఎస్సై సురేంద్రనాయుడు, హెచ్‌సీ ఎం.అచ్చిరాజు, శ్రీనులను డీఎస్పీ అభినందించారు.

తల్లిచెంతకు చేరిన పసికందు



పసికందును తల్లికి అప్పగిస్తున్న డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు (పక్కన ముసుగులో నిందితురాలు)

విజయనగరం క్రైమ్: పట్టణంలో కిడ్నాప్ అయిన 8 నెలల పసికందు ఆచూకీ కనిపెట్టి, గంటల వ్యవధిలోనే కేసుమిస్టరీని వన్‌టౌన్ పోలీసులు ఛేదించి, పసికందును కన్నతల్లిచెంతకు చేర్చారు. ఈ మేరకు ఎస్పీ వకుల్ జిందాల్ ఆదివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రంలోని రాయగడకు చెందిన ఆశా సాహు, భర్త, కుమారుడితో కూలి పని నిమిత్తం విజయనగరం వచ్చి, ఎత్తుబ్రిడ్జి సమీపంలో ఉంటున్నారు. ఈ నెల 8న మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల సమయంలో ఆమె నిద్రపోతున్న సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి, తన పక్కనున్న 8నెలల పసికందు అభిన సాహూను కిడ్నాప్ చేసి తీసుకుపోయినట్లు విశ్వకాంచన అనే స్వచ్ఛంద సంస్థ సహకారంతో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో నవంబర్ 9న బాధితురాలు ఆశా సాహు ఫిర్యాదుచేసింది. ఈ ఫిర్యాదుపై వన్‌టౌన్ ఎస్సై ఎ.నరేష్ కేసునమోదుచేసి, దర్యాప్తు చేపట్టారు. కేసును తీవ్రమైన చర్యగా భావించిన కిడ్నాప్ కేసును ఛేదించేందుకు ఎస్పీ ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి, నిందితుల కోసం గాలింపు చేపట్టాలని ఆదేశించారు. దీంతో ఈ కేసులో సాంకేతికను వినియోగించి, పసికందును ఒక మహిళ కిడ్నాప్ చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. నిందితురాలి ఆచూకీ కనిపెట్టేందుకు విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, వన్‌టౌన్ ఇన్‌చార్జ్ సీఐ ఎల్.అప్పలనాయుడుల ఆధ్వర్యంలో పోలీసు బృందాలు ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్, పట్టణంలోని ప్రధానకూడళ్లు, శివారు ప్రాంతాల్లో ముమ్మరంగా గాలింపు చేపట్టారు. చివరకు మూడు గంటల వ్యవధిలోనే పసికందును కిడ్నాప్ చేసిన నిందితురాలిని దాసన్నపేట నాగాశపు వీధికి చెందిన కోరాడ సుశీలగా గుర్తించి, అరెస్టు చేసి, ఆమె వద్ద నుంచి పసిబిడ్డను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బాలుడ్ని విజయనగరం డీఎస్పీ సమక్షంలో బాధిత తల్లికి ఆదివారం అప్పగించారు. నిందితురాలైన కోరాడ సుశీలను రిమాండ్‌కు తరలించారు. కేసులో క్రియాశీలకపాత్ర పోషించిన వారిని ఎస్పీ అభినందించారు.

మాస్ ఫిలిమ్‌తో ముందుకు వస్తున్నా..

● ప్రముఖ సినీ నటుడు వరుణ్ తేజ్



మాట్లాడుతున్న హీరో వరుణ్ తేజ్

విజయనగరం టౌన్: మాస్ ఫిలిమ్‌తో ముందుకు వస్తున్నాను. ప్రేక్షకులు ఆశీర్వదించాలి. అభిమానించి సినిమాను సక్సెస్ చేయాలని ప్రముఖ సినీనటుడు వరుణ్ తేజ్ కోరారు. స్థానిక ఆదిత్య థియేటర్‌లో ఆదివారం ఉదయం ఆయన సందడి చేశారు. ముందుగా ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం శ్రీ పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం సినిమా థియేటర్‌కు వచ్చిన ఆయన అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా మాస్ తరహాలో మట్కా సినిమాలో నటించాను. పోస్టర్ రిలీజ్ చేయడానికి విద్యల నగరమైన విజయనగరం రావడం నా అదృష్టంగా భావిస్తున్నామన్నారు. అనంతరం థియేటర్‌లో ప్రేక్షకులతో మాట్లాడుతూ తన సినిమాను అందరూ చూసి, ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో థియేటర్ మేనేజర్ వర్మ, అభిమాన సంఘం నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో జిల్లాకు పతకాలు



స్కేటింగ్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన 36వ ఇంటర్ డిస్ట్రిక్ట్ రోలర్ స్కేటింగ్ చాంపియన్ షిప్-24లో భాగంగా ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు కాకినాడలో జరిగిన పోటీల్లో విజయనగరం క్రీడాకారులు 5 బంగారు, 7 సిల్వర్, 8 కాంస్య పతకాలతో మొత్తం 20 పతకాలు రాష్ట్రస్థాయిలో సాధించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌వీఎస్ సీతారామ రాజు (చంటి రాజు) తెలియజేశారు. పతకాలు సాధించిన వారిలో ఎస్.రాహుల్ సిద్ధార్థ, ఆర్.భార్గవ్ సాయి, ఎల్. జే.దేవాన్ష్, ఎస్.ప్రదీప్, పి.హాసినిలు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు ఆయన తెలియజేశారు. పతకాలు సాదించిన స్కేటర్లను, కోచ్‌లు బద్రీనారాయణ మురళీకృష్ణ, శ్యామ్‌లను అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌వీఎస్ సీతారామ రాజు,రాష్ట్ర అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఏఆర్‌వీఎస్ఎస్ మూర్తి ,అసోసియేషన్ సభ్యులు శ్రీనివాసరావు, లక్ష్మి, మోహన్ రావులు అభినందించారు.

పార్కులో పర్యాటకుల సందడి



ఫైవ్ డి థియేటర్‌లో మూవీ చూస్తున్న పర్యాటకులు



జలవిహార్‌లో బోటుషికారు

సీతంపేట: కార్తీక మాసం కావడంతో స్థానిక అడ్వెంచర్ పార్కులో పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. జలవిహార్‌లో బోటుషికారు, ఫైవ్‌డీ థియేటర్‌లో అడ్వెంచర్ మూవీస్ చూసి ఆనందించారు. జెయింట్ వీల్, షూటింగ్, క్లైంబింగ్‌వాల్, హ్యాంగింగ్ బ్రిడ్జి వంటివి ఎక్కి సరదాగా గడిపారు.

కిరాణా షాపు దగ్ధం



విద్యుత్ షాక్ గురైన ధర్మ



కిరాణా షాపులో చెలరేగిన మంటలు

గరుగుబిల్లి: మండలంలోని పెదగుడబ గ్రామానికి చెందిన పత్తిగోల రమేష్ కిరాణా షాపు ఆదివారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. ఆ దుకాణానికి సరఫరా అయ్యే విద్యుత్ లైను షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం సంభవించినట్లు స్థానికులు పేర్కొన్నారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పార్వతీపురం అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన గ్రామానికి చేరుకుని మంటలను అదుపు చేసి ఆస్తినష్టాన్ని కొంతమేర తగ్గించారు. ఈ ఘటనలో విద్యుత్ సరఫరాను నియంత్రించేందుకు గ్రామానికి చెందిన ధర్మ అనే యువకుడు ప్రయత్నించి విద్యుత్ షాక్‌కు గురై అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. దీంతో చికిత్సకోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించి అవసరమైన వైద్యసేవలను అందిస్తున్నారు. ప్రమాదంలో రూ.లక్షల్లో ఆస్తినష్టం సంభవించడంతో రమేష్‌తో పాటు కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ప్రమాదం జరిగిన విషయాన్ని తెలుసుకుని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదంపై వివరాలను సేకరించారు.

యువకుడిపై దాడి



సతీష్‌కుమార్

గంట్యాడ: మండలంలోని రావివలస జంక్షన్‌లో పాన్ షాప్ వద్ద జరిగిన వివాదంలో పెదవేమలి గ్రామానికి చెందిన ఎస్. సతీష్‌కుమార్‌పై లక్కిడాం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు దాడి చేసి తీవ్రంగా కొట్టారు. దీంతో గాయపడిన సతీష్‌కుమార్‌ను స్థానికులు చికిత్స నిమత్తం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఔట్ పోస్టు పోలీసులు బాధితుడి నుంచి ఫిర్యాదు తీసుకున్నారు.

నాలుగు ఆలయాలు ఒకే చోట

● అపురూప శిల్ప సంపదలు
● రాతి కట్టడం ప్రత్యేకతలు



చాతుర్లింగేశ్వర ఆలయం,(ఇన్‌సెట్లో) ఆలయంలో శివలింగం

బలిజిపేట: సువర్ణముఖి నది పరీవాహక ప్రాంతంలో గల నారాయణపురం గ్రామంలో నిర్మించిన చాతుర్లింగేశ్వర దేవాలయం ఎంతో ప్రసిద్ధి గాంచినది. 11వ శతాబ్దంలో అపురూప శిల్ప సంపద, రాతికట్టడాలతో నిర్మించి, శ్రీనీలకంఠేశ్వర, సంగమేశ్వర, మల్లికార్జున, శ్రీ నీలేశ్వర ఆలయాలు ఒకేచోట నిర్మించి ఉండడం ఇక్కడి ప్రత్యేకత. దూర ప్రాంతాల నుంచి భక్తులు ఇక్కడికి వచ్చి శివార్చన చేస్తూ తరిస్తున్నారు.

నారాయణపురం కోవెలకు ఎలా వెళ్లాలంటే..

విశాఖ, విజయనగరం, పార్వతీపురం నుంచి వచ్చేవారు బొబ్బిలి చేరుకుని అక్కడినుంచి నేరుగా నారాయణపురం బస్సు ఎక్కితే చేరుకోవచ్చు. ఒక వేళ బలిజిపేట బస్సు ఎక్కితే బలిజిపేటలో దిగి అక్కడి నుంచి ఆటో, ఇతర వాహనాలపైన అయినా 5కిలో మీటర్ల దూరంలో ఉన్న నారాయణపురం చేరుకోవచ్చు. శ్రీకాకుళం నుంచి వచ్చేవారు రాజాం మీదుగా పణుకువలస జంక్షన్ నుంచి తిరిగి వంతరాం, బలిజిపేట మీదుగా నారాయణపురం చేరుకోవచ్చు. రాజాం నుంచి బస్సులో వచ్చేవారు బలిజిపేటలో దిగి నారాయణపురం చేరుకోవచ్చు.

సోషల్ మీడియాలో వేధింపులు ఆపండి

● బిడ్డ మృతి చెందడం మా దురదృష్టం
● ఆస్పత్రిలో తల్లికి తెలిస్తే ప్రమాదం




మాట్లాడుతున్న గౌరునాయుడు, కుటుంబ సభ్యులు


చీపురుపల్లి: ఓ వైపు బిడ్డ చనిపోయి మరోవైపు నా భార్య ఆస్పత్రిలో అత్యవసర చికిత్స పొందుతుండగా కష్టాల్లో ఉన్న తమపై సోషల్ మీడియాలో అపోహలు సృష్టిస్తూ వస్తున్న వేధింపులను ఇకనైనా ఆపాలని గరివిడి మండలంలోని కాపుశంభాం గ్రామానికి చెందిన ఏనూతల గౌరునాయుడు కోరారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం పట్టణంలోని బాబూజీ ఆస్పత్రి వద్ద గౌరునాయుడు, మృతి చెందిన బిడ్డ అమ్మమ్మ శ్రీదేవి, అన్నయ్య హరీష్‌లతో బాటు గవిడి సురేష్‌లు విలేకరులతో మాట్లాడారు. గ్రామానికి చెందిన మౌనికకు నెలలు నిండడంతో ఈ నెల 8న బాబూజీ ఆస్పత్రిలో ప్రసవం కోసం చేర్పించామన్నారు. సాధారణ ప్రసవం కోసం చూసిన వైద్యులు సాయంత్రం 6 గంటలకు సమయంలో సిజేరియన్ చేయాలని చెప్పడంతో తమ అంగీకారంతోనే సిజేరియన్ చేసినట్లు తెలిపారు. సిజేరియన్ ద్వారా ప్రసవించిన మగ బిడ్డ ఆరోగ్య పరిస్థితి బాగాలేక మృతి చెందాడని దీంతో తల్లడిల్లిపోయిన తామంతా ఆస్పత్రిలో యాజమాన్యంతో వాగ్వాదానికి దిగిన సంగతి వాస్తవమేనన్నారు. తరువాత తమ వైపు పెద్దలు గవిడి సురేష్, మహంతి సూర్యారావు, కోరాడ శ్రీను తదితరులు వైద్యులతో మాట్లాడగా బిడ్డ మృతికి కారణమైన వివరాలు వైద్యులు వివరించారని దీంతో తమను ఓదార్చారని చెప్పారు. తమకు అదృష్టం లేక బిడ్డను కోల్పోయామన్నారు. అయితే వైద్యులు బాధ్యతగా బిడ్డ తల్లి మౌనికను పూర్తి స్థాయిలో చికిత్స అందించి ఇంటికి పంపిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఆస్పత్రి యాజమాన్యంతో తాము కుమ్మక్కైనట్లు రెండు రోజులుగా సోషల్ మీడియాలో వస్తున్న అపోహలు ద్వారా తాము తీవ్ర ఆవేదనకు లోనవుతున్నట్లు చెప్పారు. బిడ్డ మృతి చెందిన విషయం తల్లి మౌనికకు ఇంతవరకు తెలియదని అత్యవసర చికిత్స పొందుతున్న ఆమెకు ఈ విషయం తమకు తెలిస్తే దూరమయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా కష్టాల్లో ఉన్న తమపై ఎలాంటి అపోహలు సృష్టించొద్దని విజ్ఞప్తి చేశారు.

బొలెరో బోల్తా పడి యువకుడి మృతి

● 19 మందికి గాయాలు
● అంతా గనిశెట్టిపాలెం వాసులే..



బోల్తా పడిన బొలెరో వాహనం



ఎస్.కోట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

శృంగవరపుకోట/కొత్తవలస: దైవదర్శనం కోసం వెళ్లి తిరుగుప్రయాణంలో వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా 19మంది గాయాలపాలయ్యారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్.కోటకు పొరుగున అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో అనంతగిరి మండలంలో ఎస్.ఆర్.పురం సమీపాన కొండపై కొలువున్న అనంత వెంకటేశ్వరస్వామి ఆలయ దర్శనం కోసం కొత్తవలస మండలం, గనిశెట్టిపాలెం గ్రామానికి చెందిన సుమారు 70మంది మూడు బొలెరో వాహనాల్లో బయల్దేరారు. వారంతా స్వామిని దర్శించి మధ్యాహ్నం కొండపై నుంచి కిందికి వస్తుండగా, ఒక బొలెరో వాహనం బ్రేక్ ఫెయిల్ అయి అదుపు తప్పి, తలకిందులుగా బోల్తా కొట్టింది, దీంతో వాహనంలో ఉన్న 20 మంది గాయాల పాలయ్యారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో 108 వాహనంలో వారిని ఎస్.కోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా అప్పటికే క్షతగాత్రుల్లో సూరెడ్డి కిరణ్‌కుమార్(22) మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మిగిలిన వారిలో 13 మంది తీవ్ర గాయాల పాలవడంతో మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. మరో ఆరుగురు ఎస్.కోట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రాష్ట్ర వెలమ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, గనిశెట్టిపాలెం గ్రామ సర్పంచ్ జామి ఈశ్వరరావులు దగ్గరుండి క్షతగాత్రులను మెరుగైన చికిత్సకు తరలించి సహాయక చర్యలను పర్యవేక్షించారు.

శంబర పోలమాంబ జాతర తేదీలు ఖరారు



మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి జాతర తేదీలను దేవదాయ శాఖ అధికారులు గ్రామపెద్దల సమక్షంలో ఆదివారం ఖరారు చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం శంబర గ్రామంలో కొలువైన శంబర పోలమాంబ అమ్మవారి జాతర తేదీలను చదురు గుడిలో ప్రకటించారు. డిసెంబర్ 23న పెద్దమ్మవారి సనప చాటింపు వేస్తారు. 30న పెద్దమ్మవారిని గ్రామంలోకి తెచ్చేందుకు ముహూర్తం ఖరారు చేశారు. 2025 జనవరి 6వ తేది పెద్దమ్మవారి తొలేళ్ల ఉత్సవం, 7న ప్రధాన ఉత్సవం, 8న అనుపోత్సవం నిర్వహించి, అదే రోజు శంబర పోలమాంబ అమ్మవారు (చిన్నమ్మ వారు) పండగ తెచ్చేందుకు చాటింపు వేస్తారు. జనవరి13న పోలమాంబ అమ్మవారిని గ్రామంలోకి కొని తెచ్చేందుకు నిర్ణయించారు. జనవరి 14వ తేదీన అమ్మవారు గ్రామానికి చేరుకుని, చదురుగుడిలో విశ్రాంతి తీసుకుంటారు, అప్పటినుంచి 13 రోజులపాటు పోలమాంబ అమ్మవారు గ్రామంలో తిరువీధి చేస్తూ, భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. జనవరి 27న తొలేళ్ల ఉత్సవం, 28న సిరిమానోత్సవం, 29న అనుపోత్సవం నిర్వహించేందుకు దేవదాయ శాఖ అధికారులు, గ్రామ పెద్దలు, రెవిన్యూయుడు, ఆశాజీల సమక్షంలో నిర్ణయించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ సిబ్బంది, మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్‌లు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.